



"అయ్యా?"

"ఏం(టా?"

"ఇయాల నాతో ఆరిబాబు మాట్లాడాడయ్యా" చాలా సంతోషంగా చెప్పాడు రంగడు.

"ఎవురి బాబురా?"

"ఎదురింటి మేడోరి చినబాబు"

"నీవోయి సాయినేనా? ఏం మాట్లాడారురా?" అడిగాడు సుబ్బన్న.

"నీవోరి కొడుకువని అడిగాడు. నీ కొడుకునని సెప్పాను. 'సుబ్బన్న గోడి కొడుకువా నువ్వు' అని, నాకేమన్నా ఆటలొచ్చా అని అడిగాడు. నాకొచ్చిన ఆటలన్నీ సెప్పాను. 'చీఛీ' అవి పాత ఆటలు అని అసయించుకుని రేపు సాయింకాలం వొత్తే కొత్త ఆటలు నేరుపుతానన్నాడు. రేపు ఎల్లాల" అన్నాడు రంగడు ఆశగా ఎటో చూస్తూ.

"యెలితే యెల్లుగాని ఆరికాడ నాకాడ అడిగినట్టు యికారం తెప్పించే మాటలు మాట్టాడబోక. సాలా జాగరతగా వుండాల' అన్నాడు సుబ్బన్న కొడుక్కి కలిమికి, లేమికి ఉన్న బేధాన్ని విప్పుతూ.

"ఎందుకనయ్యా? ఏటికలా ఉండాల?"

"అదుగో ఎదవ పెస్నలూ నువ్వు. ఆడబళ్లో సెప్పేది ఇంతేనం(టా. పెతిసారీ మనం కూత్తికూడే ఎందుకు తినాల? ఆమేడోరు ఇయాల ఇంత అన్నం పారేశారు బయట, ఎందుకయ్యా" అంటూ సవాలు పశ్నలు – అదంతేరా ఆళ్లు గొప్పోళ్లు, మనం బడుగోళ్లం. ఆళ్లకాడ కిందే ఉండాలనిసెప్పే వినిపించుకోవాయిరి. ఆళ్ల బాబుతో నువ్వూ ఆడొద్దుకాని బుద్దిగా గుడిసెకాడ పడుండు."

"ఆరినలా అడగనయ్యా. ఆరికి పత్తానని సెప్పాను. ఎల్లకపోతే నేనంటే జోడుగా ఉండరేమో, తప్పకుండా ఎల్లాలయ్యా."

"ఏటిరా. నీలోనే ఉందా ఆ రి బా బు పెపంచం. ఆయనతో ఆడమనేవారే కరువయ్యారా యేంటి?"

"అదికాదయ్యా. నన్నుపిలిచి రమ్మన్నారుగందా. నేనెల్లాల. నేనెలతానయ్యా" అంటూ లేచాడు రంగడు ఇంకా అక్కడుంటే సుబ్బన్న ఇంకా అడ్డంకులేమన్నా చెబుతాడేమోనని.

"ఎల్లుగాని ఆరితో పిచ్చిగా మాట్టాడకు. ఆరికిష్టంగా ఉంటే కసింతసేపు ఆడుకుని

వచ్చేయ్. నీగురించేమన్నా పెడుగా తెలిసిందా తాట ఒలిసేత్తాను జాగరత.''

''సరేలే అయ్యా'' విసుగుగా అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు రంగడు.

వాడెళ్ళిన వంకే చూస్తూ 'పిచ్చిఎదవ' అనుకున్నాడు సుబ్బన్న. 'ఈడికీ వొయిసులో ఎంత కోరికో, ఎంత ఆలోచనో'! అనుకున్నాడు. చుట్ట చుట్టుకోవడానికి పుగాకు కోసం బనీను జేబు తడుముకున్నాడు. అందులో లేకపోవటంతో 'ఏ ఎదవ బతుకు,' అనుకుంటూ తుపుక్కున ఉమ్మేశాడు.



# ఆటలు-అంతస్థులూ

కోటభరణ్యశ్రీ

తెల్లవారిన దగ్గర్నించీ, ఎప్పుడు సాయంత్రం అవుతుందా, ఎప్పుడు ఆమేడ వాళ్ళబ్బాయిని కలుసుకుందామా అని ఉవ్విళ్ళూరాడు రంగడు.

ఆ సాయంత్రం రానేవచ్చింది. గుడిసె బయట నుంచున్నాడు రంగడు. రెండు మూడు సార్లు ఏదోపనిమీద బయటకివచ్చిన ఆ మేడ వాళ్ళబ్బాయికి రంగడు చేయి ఊపాడు. ఆ అబ్బాయి గమనించాడో, లేదో కాని ఇటు రాలేదు. 'సూడలేదేమో'అని సరిపెట్టుకున్నాడు రంగడు. మరోసారి ఆఅబ్బాయి బయటకొచ్చినపుడు, చప్పట్లు కొట్టాడు.

ఆ అబ్బాయి వెనుదిరిగాడు. 'ఏమిటన్నట్లు చూసి, ఏదో గుర్తుకొచ్చిన వాడిలా రంగడు దగ్గరికొచ్చాడు. రంగడి మనసు ఆనందంతో నిండిపోయింది. రంగడు నవ్వాడు.

''నువ్వు సుబ్బన్నకొడుకునని చెప్పావుగదూ! నీకేమేమీ ఆటలొచ్చు ?''

''అదేటి, ఈన నిన్న అడిగినోడుగదా. మళ్ళీగా అడుగుతాడేంటి ?'' అనుకున్నాడు రంగడు నిరుత్సాహంగా. అయినా ఏవన్నా అడిగితే అయ్య 'ఎదవ పశ్నల'ంటూ తంతాడనుకుని తనకొచ్చిన ఆటలన్నీ మళ్ళీ చెప్పాడు.

'అబ్బే, అవి ముసలమ్మ ఆటలు' తేల్చేశాడు.

''బాబూ మీపేరేటన్నారు బాబూ.''

''బాబు''

''అదికాదు బాబు. మీ అసలుపేరు?''

అసలుపేరు, కొసరుపేరు ఉంటాయా. నా పేరు ఫణిబాబు.''

''పనిబాబు, ఎంత బాగుండాది పేరు'' అనుకున్నాడు రంగడు.

''మరి నీపేరేంటి.''

''రంగారావు బాబూ, మా అయ్యావోళ్ళు రంగడని పిలుస్తారు.''

''ఉరేయ్ రంగా''

''ఈన ఉరేయ్ అంటాడేటి తను బాబూ అంటుంటే'' — తన తండ్రి గుర్తుకొచ్చి మౌనంగా ఊరుకున్నాడు రంగడు.

''ఒరేయ్ నీకు అడుక్కునే ఆట వచ్చురా ?''

''అదేటాట బాబూ, అన్నాలాటా'' నవ్వుతూ అడిగాడు రంగడు.

''ఓరి, అది ఆడపిల్లల ఆటరా'' 'అడుక్కునే ఆట' అంటే చెప్తావిను. నేను అడుక్కునేవాణ్ణి అన్నమాట ! నీదగ్గరకొచ్చి అడుగుతాను. నువ్వులేవని కసురుకుంటావు. నేను నిన్ను బతిమాలుతాను. నువ్వప్పుడు విసుక్కుని డబ్బులు వేస్తావు' అంటూ ఆ 'అడుక్కునే ఆట'ను వివరించాడు ఫణిబాబు.

రంగడికీ ఆట బాగానేఉంది.

వెంటనే ఆ ఆట ప్రారంభించారు.

''బాబు. నిన్నటినుంచి అన్నంలేదుబాబూ. ఓ పైసా ధర్మం చెయ్యండి బాబు, మీకు పుణ్యం ఉంటుంది'' అన్నాడు ఫణిబాబు.

''లేవు ఫో,'' అన్నాడు రంగడు.

''అంతేనా, ఇంకా గట్టిగా కసురుకోవాలిరా'' — ఫణిబాబు రంగడి పైలాగుని సరిదిద్దాడు.

'బాబూ, నేను 'లేవుపోరా' అనొచ్చునా?'

'అనొచ్చురా ఊ ... కానీ దర్మం చెయ్యి బాబూ, ఆకలిగా ఉంది బాబూ'

'ఓరి, చెప్తుంటే నీక్కాదూ, నాకాడ పైసాలేదు. అంటున్నాపో.''

''అంతేకాదురా, దుక్కలా బలిసిఉన్నావు. పనిచేసుకోలేవా అనాలి.''

''సరేబాబు. దున్నపోతులా ఉన్నావు. ఆదేడన్నాబోయి పనిసేసుకోరాదూ''.

''అలా అనొద్దు బాబయ్యా, మీరే రక్ష, మీరేదిక్కు. నువ్వు ఇప్పుడేం లేవు అనాలి''.

''నాకాడ పైసాలేదు, పోపో''

''మీరుకాక ఎవరు వేస్తారుబాబూ ... నువ్విప్పుడు విసుక్కుని డబ్బులు వెయ్యాలి''.

''నాకాడ పైసల్లేవు బాబూ''

''ఇదిగో ఈ పావలా తీసుకుని మళ్ళీనాకు వెయ్యి''

''సరేబాబు. ఇదిగో అడుక్కోవటం

## ఆటలూ – అంతస్తులూ

మరియాదకాదురా, ఈ పైసలు తీసుకుని మళ్లీ ఇటురాబోక.''

"ఆఁ ... అదీ" అంటూ రంగడిని మెచ్చుకున్నాడు ఫణిబాబు.

"మళ్లీ ఆడదామా" అని అడిగాడు ఫణిబాబు. 'ఓ' అన్నాడు రంగడు. మళ్లీ, మళ్లీ ఆడారు. ఓసారి అడుక్కునేవాడు రంగడు. మరోసారి ఫణిబాబు.

"బాబూ అయ్యగారు పిలుస్తున్నారు." అంటూ ఎవడో పనిమనిషి వచ్చి ఫణిబాబుని ఎత్తుకున్నాడు. "వస్తానురా రంగా, రేపు రా మళ్లీ" అంటూ వాడితో వెళ్లిపోయాడు ఫణిబాబు. తనకోసం 'తన అయ్య పిలుస్తున్నాడంటూ' ఎవరూ రాకపోవటంతో తనే వాళ్ల గుడిసెవైపు బయల్దేరాడు రంగడు.

రోజూ ఫణిబాబు, రంగడు సాయంత్రం పూట కలుసుకునేవాళ్లు. ఫణిబాబు రోజుకో కొత్త ఆట నేర్పేవాడు. కుంటివాళ్ల ఆట! గుడ్డివాళ్ల ఆట! తాగిన వాళ్ల ఆట! ఇలా బోలెడు రకాల ఆటలు! వాళ్లిద్దరికీ జోడు కుదిరింది. రంగడికి అనేక ప్రశ్నలు వస్తూంటేవి. కాని ఏవీ అడిగేవాడు కాదు.

ఫణిబాబు చదువుకోసం హాస్టల్లో చేరిన తర్వాత వారు విడిపోవటం జరిగింది.

అలా విడిపోవటం పోవటం, వాళ్లెక్కడ కలుసుకున్నారో తెలుసా ?

రంగడు స్వయం కృషితో, స్కాలర్ షిప్పులతో 'ఇంటర్' ప్యాసయ్యాడు. ఉద్యోగం కోసం ఐదేళ్లనుంచీ తిరుగుతున్నాడు.

ఫణిబాబు. ఎవరి కృషివల్లో ఏమోగాని టక్కున ఓ ఆఫీసుకి ఆఫీసరైపోయాడు.

* * *

మామూలుగా 'గుడ్ మార్నింగ్ సార్' అంటూ లోపలికి అడుగుపెట్టిన రంగారావు 'టేక్ యువర్ సీట్' అన్న కంఠం విని తల పైకెత్తి, ఒక్కసారిగా విస్మయంలో పడ్డాడు.

ఫణిబాబు! తనతో ఆడుకున్న పనిబాబు!!

'టేక్ యువర్ సీట్'—మరోసారి అన్నాక బెరుకుగా కూర్చున్నాడు రంగారావు.

"నేను ... రంగనండీ"

"ఓహో. రంగడివా. బాగా మారిపోయావురా. మీ వాళ్లంతా బాగున్నారా"

"అంతా బాగున్నారండి. మీ దయవల్ల"

"ఓరి... మాటకూడ మారిపోయిందే"

"నేనింకా చిన్నప్పటి రంగడినే అనుకుంటున్నట్లున్నారు. చాలా చక్కగా మాట్లాడుతున్నారు ఫణిబాబు. నేను అడిగితే నాకే ఇస్తారేమో ఈ ఉద్యోగాన్ని!'' అనుకున్నాడు రంగారావు మనసులో.

"ఉద్యోగం ఒక్కటే ఉన్నట్లు ప్రకటించారు. మా సంగతి మీకు తెలుసుగదా.అమ్మని, నాన్నని మిగతా పిల్లల్ని పోషించాలి. నాకిప్పించండిబాబు ఆ ఉద్యోగం. మీ పేరు చెప్పుకుంటూరు.''

"నో మిస్టర్ రంగా నా ఉద్యోగం కర్తవ్యం నేను నిర్వహించక తప్పదు. స్నేహానికి, బంధుత్వానికి అతీతమైనది ఉద్యోగ నిర్వహణ. నిజమే. ఒక 'పోస్టు' మాత్రమే ఉంది. 'మెరిట్'బట్టి ఇవ్వాలి. నీకు అన్ని క్వాలిఫికేషన్స్ ఉంటే నీకేవస్తుంది. ఆ సర్టిఫికెట్లు ఇలాఇవ్వు'.

రంగారావు సర్టిఫికెట్లిస్తుంటే చెయ్యి వణికింది. ఆ చేత్తో ఆటల్లో అనేకసార్లు పావలాలు, ఐదుపైసలు, ఫణిబాబు డబ్బే అయినా ఫణిబాబు కిచ్చాడు చిన్నతనంలో.

సిగిరెట్టు వెలిగించి పొగ వదులూ 'గుడ్' అన్నాడు ఫణిబాబు సర్టిఫికేట్లు చూస్తూ. రంగారావు మురిసిపోయాడు.

"యస్. యుకెన్ గో" అన్నాడు ఫణిబాబు అధికారదర్పం గొంతు నిండా ధ్వనిస్తుండగా.

రంగారావు బరువుగా, ఉద్యోగం వస్తుందన్న ఆశ మనసులో చోటు చేసుకోగా బయటకు నడిచాడు.

ఫణిబాబు టేబుల్పై టెలిఫోను మ్రోగింది.

'హలో, ఫణిబాబు హియర్'

'హైదరాబాదునుంచి ట్రంకాల్ సార్'–ఆపరేటర్ గొంతు.

"కనక్టనివ్వండి"

... ... ... ...

"హలో, ఫణిబాబు హియర్"

"హలో, ఆఫీసరేనా?' — ఎవరో ప్రజా నాయకుడి గొంతు.

"అవునండి. తమరు?"

"మీ డిపార్టుమెంటుమినిష్టరువయ్యా"

"అయ్యా, నమస్కారం సార్"

"అవునుగాని, మీ ఆఫీసులో ఏదో ఖాళీ ఉందటగా. మావాడొకడు ఉద్యోగం చేస్తానని ఒకటే గోల పెడుతున్నాడు. వాడికి...''

"ఆయన ఇంటర్వ్యూకొచ్చిన వాళ్లల్లో ఉన్నారా సార్"

"లేదు. నాదగ్గరే ఉన్నాడు. రేపు అక్కడికి వస్తానంటున్నాడు. వాడికి ఉద్యోగం ఇచ్చేయ్."

"అలాగే సార్, మీరు చెప్పటమూ, కాదనటమూనా?"

అక్కడ ఫోను పెట్టేసినట్లు శబ్దమయ్యే సరికి తనూ రిసీవరు పెట్టేశాడు ఫణిబాబు.

కాలింగ్బెల్ కొట్టి బంట్రోతు రాగానే రంగడి సర్టిఫికేట్లు వాడికందించి,"టైపిస్ట్ కిచ్చి రిగ్రెట్ కార్డు కొట్టి దాంతోపాటే వీటినీ కవరులోపెట్టి తెమ్మను సంతకం చేస్తాను." అన్నాడు ఫణిబాబు.

### యువతరం



కాలేజీలో పుట్బాల్, కబడ్డీ లాంటిఆటల్లో మంచి పేరు తెచ్చుకున్న వై. మహదేవ శాస్త్రికి బి. కామ్. పూర్తికాగానే సి. ఏ. చేయాలనుంది. యువకులంతా వ్యాయామంచేయాలి మంచి అలవాట్లు చేసుకోవాలి అని వాదించటమే గాక, అలా తాను వుంటాడు కూడా. రాజకీయాలతనికి తెలియవు. వాటిల్లో తల దూర్చడు. నాటకానుభవం వుంది. రచన సరదా వుంది. ప్రేమ పెళ్లిళ్లపై గౌరవం గల యీ యువకునికి భాషను పెంపొందించుకోవాలన్న తహ తహ వుంది. అందుకోసం యింగ్లీష్,హిందీ పుస్తకాలు చదువుతాడు కాని తెనుగు అంటే వల్లమాలిన అభిమానం. విదేశాలు వెళ్లాలన్న ఆకాంక్ష వుంది కూడా అందుకని మాతృభాషతో పాటు తతిమ్మా భాషలు నేర్చుకుంటున్నాడు. క్రికెట్ కామెంటరీ వింటాడు — అమితాబ్ బచ్చన్, హేమ మాలినీలను అభిమానిస్తాడు — మంచి సినిమాలన్నీ చూస్తాడు.